సీటీ స్కాన్‌తో క్యాన్సర్!

వయసు ఎంత తక్కువైతే ముప్పు అంత ఎక్కువ ▪ తాజా అధ్యయనం హెచ్చరిక

ఈస్ట్ ఆంగ్లియా (యూకే): మానవ శరీరంలో క్యాన్సర్‌ను కనుగొనడానికి సీటీ స్కాన్ నిర్వహిస్తారు. కానీ సీటీ స్కాన్ చేయడం వల్ల ఆరోగ్యంగా ఉన్న వారికి సైతం క్యాన్సర్ వచ్చే ప్రమాదమున్నదని తాజా అధ్యయనం వెల్లడించింది. ఆధునిక వైద్య పరిజ్ఞానంలో సీటీ స్కాన్ అనేది ఎంతో కీలకంగా మారిన సంగతి తెలిసిందే. సీటీ స్కాన్ చేయడం ద్వారా శరీరంలోని రుగ్మతలను వేగంగా, సమగ్రంగా తెలుసుకొనే అవకాశం కలుగుతుంది. డాక్టర్లకు ఇది ఎంతో ఉపయోగకరంగా మారింది. అయితే ఈ పరిజ్ఞానంపై అధికంగా ఆధారపడటం ప్రమాదకరం కావచ్చని ఈ అధ్యయనం హెచ్చరించింది. జామా ఇంటర్నల్ మెడిసిన్ పత్రికలో ఈ వివరాలు ప్రచురించారు.

ఇదే రీతిలో కొనసాగితే..

అమెరికాలో 2023లో నిర్వహించిన సీటీ స్కాన్‌ల కారణంగా లక్ష క్యాన్సర్ కేసులు అధికంగా నమోదయ్యే అవకాశం ఉన్నదని ఆ అధ్యయనం హెచ్చరించింది. సీటీ స్కానింగ్‌ల రేటు ఇప్పుడున్న రీతిలోనే కొనసాగితే.. కేవలం సీటీ స్కాన్‌ల కారణంగానే ప్రపంచవ్యాప్తంగా ఐదు శాతం క్యాన్సర్ కేసులు పెరగవచ్చని తెలిపింది. ఇది ఆందోళనకరమని పేర్కొంది. అమెరికాలో గత పదేండ్ల కాలంలో సీటీ స్కాన్‌ల సంఖ్య 30 శాతం పెరిగిందని తెలిపింది. ఒకేఒక్కసారి సీటీ స్కాన్ చేయడం వల్ల ముప్పు చాలా తక్కువగా ఉండవచ్చు తప్ప అసలు లేకుండా పోయే అవకాశం లేదని పేర్కొంది. రోగి ఎంత తక్కువ వయస్సువారైతే ముప్పు అంత అధికంగా ఉంటుందని తెలిపింది. సాధారణంగా వైద్యులు చిన్న పిల్లలకు సీటీ స్కాన్‌ను సిఫారసు చేయరు. 90 శాతం వరకు సీటీ స్కాన్‌లు వయోజనులపైనే జరుగుతున్న నేపథ్యంలో వారికే ముప్పు అధికంగా ఉంటుందని తెలిపింది.

ఆ క్యాన్సర్ల ముప్పు..

సీటీ స్కాన్ వల్ల ఊపిరితిత్తులు, పెద్ద పేగు, మూత్రాశయానికి క్యాన్సర్ సోకవచ్చని, లుకేమియా రావచ్చని, మహిళలకు రొమ్ము క్యాన్సర్ ముప్పు ఉంటుందని ఆ అధ్యయనం వెల్లడించింది. ఇదే అంశంపై 2009లో జరిగిన ఒక విశ్లేషణలో సీటీ స్కాన్‌ల వల్ల 29 వేల క్యాన్సర్ కేసులు నమోదు కావచ్చని అంచనా వేశారు. కానీ తాజా అంచనా అంతకు మూడు రెట్లు ఉండటం ఆందోళనకరం. పరిస్థితి ఇలాగే కొనసాగితే మద్యం, అధిక బరువు వల్ల ఎదురయ్యే ముప్పుతో సమానంగా సీటీ స్కాన్ బాధితులు కూడా ఉండవచ్చని అంచనా వేసింది. శరీరంలోని ఏ భాగాన్ని స్కాన్ చేసినా ఒకే విధమైన ముప్పు ఉండకపోవచ్చునని, ఉదరం, కటి భాగాన్ని సీటీ స్కాన్ చేయడం వల్ల మాత్రం భవిష్యత్తులో క్యాన్సర్ సోకే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపింది. ఏడాది లోపు పిల్లల తలను సీటీ స్కాన్ చేయడం అత్యంత ప్రమాదకరమని హెచ్చరించింది.

అవసరమైతే తప్ప సీటీ స్కాన్ వద్దు..

సీటీ స్కాన్ వల్ల క్యాన్సర్ ముప్పు ఉన్నప్పటికీ ప్రాణాలు కాపాడటంలో ఆ పరిజ్ఞానం కీలకమని వైద్యులు పేర్కొంటున్నారు. ఎమర్జెన్సీ పరిస్థితుల్లో రోగ నిర్ధారణకు సీటీ స్కాన్ దోహదపడుతుందని అంటున్నారు. తాజా హెచ్చరికల నేపథ్యంలో ఇకపై అవసరమైతే తప్ప వైద్యులు సీటీ స్కాన్‌ను సిఫారసు చేయకపోవడం మంచిదని ఆ అధ్యయనం సూచించింది. మరోవైపు సీటీ స్కాన్‌లు క్యాన్సర్ కారకాలని ఈ అధ్యయనం రుజువు చేయలేదని నిపుణులు పేర్కొంటున్నారు. ఈ అధ్యయనంలోని అంచనాలన్నీ 'రిస్క్ మాడల్స్'పై ఆధారపడినవి తప్ప ప్రత్యక్ష ఆధారాలు కాదని అంటున్నారు. రేడియేషన్ వల్ల క్యాన్సర్ రావచ్చన్నది కొత్త ఆవిష్కరణ కాదని, ఆ ముప్పు మొదటి నుంచీ ఉన్నదని పేర్కొన్నారు.

జేఈఈ మెయిన్ ఫలితాల్లో గందరగోళం

- ఫైనల్ కీ విడుదల.. గంటలోనే ఉపసంహరణ
- ఎన్టీఏపై విద్యార్థుల ఆగ్రహం

న్యూఢిల్లీ: జేఈఈ మెయిన్ ఫలితాల విడుదలలో గందరగోళం నెలకొంది. సెషన్ 2 ఫైనల్ కీని గురువారం విడుదల చేసిన ఎన్టీఏ.. కొద్దిసేపటికే ఉపసంహరించుకుంది. ఇందుకు కారణాలను వెల్లడించలేదు. రాత్రి 10 దాటినా ఫలితాలు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండో విడత జేఈఈ మెయిన్ పరీక్షలను ఏప్రిల్ 2 నుంచి 9 వరకు ఎన్టీఏ నిర్వహించింది. గత జనవరి, ఇటీవల జరిగిన రెండు విడతల పరీక్షల్లోని ఉత్తమ స్కోర్‌ను పరిగణనలోకి తీసుకుని ర్యాంకులు కేటాయిస్తారు. అయితే జేఈఈ-మెయిన్ పరీక్ష సమాధానాల్లో పలు తప్పిదాలు ఉన్నాయని ఫిర్యాదులు వస్తుండటంతో తుది కీ వచ్చే వరకు వేచి ఉండాలని ఎన్టీఏ విజ్ఞప్తి చేసింది. తుది కీలో కూడా తప్పులు ఉండటంతో ఉపసంహరించి ఉంటారని భావిస్తున్నారు.

రోడ్డు ప్రమాద బాధితులను తక్షణం ఆదుకోవాల్సిందే

మార్గదర్శకాల రూపకల్పనకు రాష్ట్రాలకు సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ: దేశంలో రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో బాధితులను తక్షణం ఆదుకోవడానికి మార్గదర్శకాలు రూపొందించాలని సుప్రీంకోర్టు గురువారం రాష్ట్రాలను, కేంద్ర పాలిత ప్రాంతాలను ఆదేశించింది. ఈ మేరకు డ్రైవర్లకు పని గంటలను అమలు చేసే విషయమై సంబంధిత రాష్ట్రాల విభాగాలతో సమావేశాలను నిర్వహించాలని కేంద్ర రోడ్డు రవాణా, హైవేల శాఖను ధర్మాసనం ఆదేశించింది. 'రోడ్డు ప్రమాదాలు పెరగడానికి వేర్వేరు కారణాలుంటాయి. అయితే బాధితులకు వెంటనే సాయం అందని కేసులున్నాయి. కొన్నిసార్లు వారు గాయపడకపోయినా వాహనాల్లో చిక్కుకుపోతున్నారు' అని బెంచ్ పేర్కొంది. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయిలో వెంటనే బాధితులను ఆదుకొనేందుకు రాష్ట్రాలు, యూటీలు తప్పనిసరిగా ప్రొటోకాల్ రూపొందించాలని కోరు ఆదేశించింది. ఇందుకోసం ఆరు నెలల గడువిచ్చింది.

మే 5 వరకు మార్పులు చేయం

- వక్ఫ్ ఆస్తులు డీనోటిఫై చేయబోం
- వక్ఫ్ నియామకాలు చేపట్టబోం
- సుప్రీం కోర్టుకు కేంద్రం హామీ
- పిటిషన్లపై వారంలోగా జవాబివ్వాలని కేంద్రానికి న్యాయస్థానం ఆదేశం

న్యూఢిల్లీ: వక్ఫ్ బై యూజర్‌తోసహా వక్ఫ్ ఆస్తులు వేటినీ డీనోటిఫై చేయడం కాని సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్, బోర్డులలో నియామకాలు కాని మే 5వ తేదీ వరకు చేపట్టబోమని కేంద్రం గురువారం సుప్రీంకోర్టుకు హామీ ఇచ్చింది. ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌తో కూడిన ముగ్గురు న్యాయమూర్తుల ధర్మాసనం గురువారం వక్ఫ్ (సవరణ) చట్టం 2025ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ జరిపింది. వక్ఫ్ బై యూజర్‌తోసహా వక్ఫ్ ఆస్తుల డీ నోటిఫికేషన్‌కు వ్యతిరేకంగా మధ్యంతర ఉత్తర్వును జారీచేస్తామన్న సుప్రీంకోర్టు ప్రతిపాదనను కేంద్రం తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా గట్టిగా వ్యతిరేకించారు. అంతేగాక సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్, వక్ఫ్ బోర్డులలో ముస్లిమేతరుల నియామకాన్ని అనుమతించే నిబంధనపై స్టే ఇస్తామన్న ప్రతిపాదనను కూడా మెహతా వ్యతిరేకించారు. వారం రోజుల్లో ప్రాథమిక సమాధానాన్ని కేంద్రం సమర్పించనున్నట్లు ఆయన ధర్మాసనానికి తెలిపారు. తదుపరి విచారణ తేదీ వరకు వక్ఫ్ కౌన్సిల్, వక్ఫ్ బోర్డులలో వక్ఫ్ (సవరణ) చట్టం లోని 9, 14 సెక్షన్ల కింద నియామకాలు చేపట్టబోమని కూడా కోర్టుకు హామీ ఇచ్చారు. అలాగే, ఇప్పటికే రిజిస్టర్ అయిన లేదా నోటిఫికేషన్ ద్వారా ప్రకటించిన వక్ఫ్ బై యూజర్‌తోసహా వక్ఫ్ ఆస్తులు వేటినీ డీనోటిఫై చేయడం కాని అంతరాయం కలిగించడం కాని చేయబోమని కేంద్రం తరపున మెహతా ఇచ్చిన హామీని ధర్మాసనం నమోదు చేసింది. తదుపరి విచారణను మే 5వ తేదీకి వాయిదా వేసింది.

వారంలో ఏమీ మారదు

చట్ట నిబంధనలపై స్టే ఇవ్వడం కఠిన చర్యగా మెహతా అభివర్ణించారు. కొంత సమాచారం, దస్త్రాలు, చట్టాలను వివరిస్తూ ప్రాథమిక జవాబును వారం రోజుల్లో ఇస్తామని మెహతా తెలియచేస్తూ ఒక వారంలో ఏమీ మారబోదని వ్యాఖ్యానించారు. ఓ రాష్ట్ర ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది రాకేష్ ద్వివేది వాదనలు వినిపిస్తూ 'వారం రోజుల్లో మధ్యంతర ఉత్తర్వులు జారీచేయకపోతే మిన్ను విరిగి మీద పడదు' అని వ్యాఖ్యానించారు.

రాష్ట్రపతికే ఆదేశాలిస్తారా?

- 'సూపర్ పార్లమెంట్'గా వ్యవహరిస్తున్న న్యాయవ్యవస్థ
- ప్రజాస్వామ్యంపై అణ్వస్త్రంగా మారిన ఆర్టికల్ 142
- జడ్జి ఇంట్లో నోట్ల కట్టలు దొరికితే ఇప్పటికీ ఎఫ్ఐఆర్ నమోదు లేదు
- పారదర్శకత, జవాబుదారీతనం తప్పక ఉండాల్సిందే
- న్యాయవ్యవస్థపై ఉప రాష్ట్రపతి ధన్‌ఖఢ్ తీవ్రవ్యాఖ్యలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 17: న్యాయ వ్యవస్థ తన పరిధులు దాటి జవాబుదారీతనం లేని సూపర్ పార్లమెంట్‌గా పనిచేస్తోందని ఉప రాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖఢ్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను నిర్ణీత గడువులోగా ఆమోదించాలంటూ రాష్ట్రపతి, గవర్నర్లకు సుప్రీంకోర్టు ఇటీవల ఆదేశాలు జారీచేసిన నేపథ్యంలో ఉప రాష్ట్రపతి చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. గురువారం నాడిక్కడ రాజ్యసభ ఇంటర్న్‌ల బ్యాచ్‌ను ఉద్దేశించి ధన్‌ఖఢ్ ప్రసంగిస్తూ, రాజ్యాంగపరంగా అత్యున్నత పదవి అయిన రాష్ట్రపతి రాజ్యాంగాన్ని పరిరక్షిస్తామని ప్రమాణం చేస్తారని, కాని ఇప్పుడు ఓ తాజా తీర్పులో రాష్ట్రపతికే ఆదేశాలు వచ్చాయని అన్నారు. 'ఎక్కడకు వెళుతున్నాం మనం? ఏం జరుగుతోంది ఈ దేశంలో?' అని ఆయన ప్రశ్నించారు. తమిళనాడు బిల్లుల కేసులో మార్చిలో తీర్పు ఇచ్చిన సుప్రీంకోర్టు 10 బిల్లులకు ఆమోదం తెలియచేయకుండా గవర్నర్ ఆర్ఎన్ రవి పెండింగ్‌లో ఉంచడాన్ని ఏకపక్ష, చట్ట వ్యతిరేక చర్యగా అభివర్ణించడాన్ని ప్రస్తావిస్తూ న్యాయ వ్యవస్థ పరిధిని ధన్‌ఖఢ్ ప్రశ్నించారు. రెండవ సారి అసెంబ్లీ ఆమోదం పొందిన బిల్లులకు మూడు నెలల్లోగా గవర్నర్ ఆమోదం తెలియచేయాలని ఆదేశించడంతోపాటు 201 అధికరణ కింద రాష్ట్రపతి విధులు కూడా న్యాయ సమీక్షకు లోబడి ఉంటాయన్న సుప్రీంకోర్టు తీర్పుపై ధన్‌ఖఢ్ ఘాటుగా స్పందించారు. 'నిర్ణీత గడువులోగా రాష్ట్రపతి నిర్ణయం తీసుకోకపోతే సంబంధిత బిల్లులు చట్టాలు అయిపోతాయని అంటున్నారు. ఇప్పుడు మనకు చట్టాలు చేసి కార్యనిర్వాహక బాధ్యతలు కూడా నిర్వర్తించి, సూపర్ పార్లమెంట్‌గా పనిచేసే న్యాయమూర్తులు వచ్చారు. వారికి మాత్రం ఎటువంటి జవాబుదారీతనం ఉండదు' అంటూ సుప్రీంకోర్టు మాజీ న్యాయవాది కూడా అయిన ధన్‌ఖఢ్ వ్యాఖ్యానించారు. రాజ్యాంగంలోని 142 అధికరణ కింద న్యాయ వ్యవస్థకు కల్పించిన అపరిమిత అధికారాలపై కూడా ధన్‌ఖఢ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రజాస్వామిక శక్తుల పాలిట 142 అధికరణ అణ్వస్త్రంగా మారిందంటూ వ్యాఖ్యానించారు.

జడ్జి ఇంట్లో నోట్ల కట్టలపై ఆందోళన

ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ అధికారిక నివాసంలో భారీ స్థాయిలో నోట్ల కట్టలు కనిపించినట్టు వచ్చిన ఆరోపణలపై న్యాయ వ్యవస్థ స్పందన పట్ల ధన్‌ఖఢ్ ఆందోళన వ్యక్తం చేశారు. మార్చి 14-15 తేదీ రాత్రి ఘటన జరిగితే మార్చి 21న కానీ పత్రికల్లో వార్త రాలేదని చెప్పారు. ఇదే ఘటన ఓ సామాన్య వ్యక్తి ఇంట్లో జరిగి ఉంటే స్పందన వేగంగా మరో మాటలో చెప్పాలంటే ఎలక్ట్రానిక్ రాకెట్ స్పీడులో ఉండేదని ఆయన వ్యాఖ్యానించారు. కాని ఇప్పుడు ఎడ్ల బండి అంత వేగం కూడా లేదంటూ ఎద్దేవా చేశారు. న్యాయమూర్తిపై ఇప్పటి వరకు ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయలేదని గుర్తు చేశారు. భారతీయ చట్టాల ప్రకారం తనతోసహా రాజ్యాంగపరమైన పదవిలో ఉన్న ఏ వ్యక్తిపైనైనా ఎటువంటి ప్రత్యేక అనుమతి లేకుండా ఎఫ్ఐఆర్ నమోదు చేయవచ్చని ఆయన అన్నారు. అదే న్యాయమూర్తుల విషయానికి వచ్చేసరికి ఎఫ్ఐఆర్‌ల నమోదుకు న్యాయవ్యవస్థ నుంచి అనుమతి అవసరమని, ఇది రాజ్యాంగం కల్పించిన అధికారం కాదని ఉప రాష్ట్రపతి స్పష్టం చేశారు.

న్యాయ దర్యాప్తు కమిటీపై విమర్శ

జడ్జి ఇంట్లో కరెన్సీ కట్టలు కనిపించిన ఘటన దర్యాప్తు కోసం ముగ్గురు న్యాయమూర్తుల కమిటీని ఏర్పాటు చేయడాన్ని ధన్‌ఖఢ్ విమర్శించారు. ఆ కమిటీకి పార్లమెంట్ నుంచి చట్టపరమైన ఆమోదం లేదని, దానికి ఎటువంటి అధికారాలు లేవని అన్నారు. 'ఆ కమిటీ సిఫార్సులు మాత్రమే చేయగలదు.. కాని ఎవరికి... ఎందుకోసం.. హైకోర్టు న్యాయమూర్తిపై తుది చర్యలు తీసుకునేది పార్లమెంటరీ ప్రక్రియ ద్వారా మాత్రమే' అని ఆయన స్పష్టం చేశారు. నెల రోజులు గడచిపోయాయని, దర్యాప్తు వేగంగా జరిగి సాక్ష్యాలను భద్రపరచాల్సిన అవసరం ఉందని చెప్పారు. మనమే చట్టాలను నీరుగార్చడం లేదా? అని కూడా ఆయన న్యాయవ్యవస్థను నిలదీశారు. న్యాయ వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం రావాలని పిలుపునిస్తూ అది పురుగుల డబ్బా అయినా, అటకలో అస్తిపంజరాలు ఉన్నా మూత తీయాల్సిన సమయం ఆసన్నమైందని, ప్రక్షాళన ప్రారంభించక తప్పదని ధన్‌ఖఢ్ వ్యాఖ్యానించారు.

కశ్మీర్ మా జీవనాడి

- దానిని మరిచిపోలేం.. పాక్ ఆర్మీ చీఫ్ వ్యాఖ్యలు
- ముందు పీవోకేను ఖాళీ చేయాలన్న భారత్

ఇస్లామాబాద్: జమ్మూకశ్మీర్‌పై పాక్ మరోసారి వక్రబుద్ధిని చాటుకుంది. కశ్మీర్ తమ జీవనాడి అని, దానిని మరిచిపోలేమంటూ పాక్ ఆర్మీ చీఫ్ జనరల్ అసిమ్ మునీర్ వ్యాఖ్యానించారు. ఇస్లామాబాద్‌లో ఓ కార్యక్రమంలో విదేశాల్లోని పాకిస్థానీయులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. 'మా వైఖరి సుస్పష్టం. కశ్మీర్ మా జీవనాడి. దానిని మరిచిపోలేం. కశ్మీర్ సోదరులను వారి వీరోచిత పోరాటంలో మేం వదిలేయలేం' అని వ్యాఖ్యానించారు. రెండు దేశాల విభజనను సమర్థించుకున్నారు. దీనిపై భారత్ ఘాటుగా స్పందిస్తూ విదేశీ భూభాగం జీవనాడి ఎలా అవుతుందని, ముందు పీవోకేను ఖాళీ చేయాలని బదులిచ్చింది.

కోడలిపై అత్త గృహ హింస కేసు

- ఒకే ఇంటిలో ఉండే ఏ స్త్రీ కైనా చట్టం వర్తిస్తుంది
- అలహాబాద్ హైకోర్టు తీర్పు

అలహాబాద్: కోడలిపై అత్త గృహ హింస కేసు పెట్టిన ఘటనలో అలహాబాద్ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. గృహ హింస చట్టం కింద తనపై కేసు నమోదు చేయటాన్ని సవాల్ చేసిన కోడలి వాదనను తోసిపుచ్చింది. బంధుత్వంతో సంబంధం లేకుండా, ఒకే ఇంట్లో నివసించే మహిళలందరికీ సదరు చట్టం వర్తిస్తుందని హైకోర్టు స్పష్టం చేసింది. కోడలిపై దిగువ కోర్టు జారీ చేసిన సమన్లను రద్దు చేయడానికి ధర్మాసనం అంగీకరించలేదు. 'కోడలు లేదా కుటుంబంలోని మరే ఇతర సభ్యుడు అత్తను వేధించినా, శారీరకంగా, మానసికంగా హింసించినా, ఆమెను బాధితురాలిగా చేర్చవచ్చు. గృహ హింస చట్టంసెక్షన్ 12 కింద కేసు పెట్టొచ్చు' అని కోర్టు పేర్కొన్నది. అయితే ఆ చట్టం కింద కేసు పెట్టే హక్కు కోడలిగా తనకు మాత్రమే ఉంటుందన్న పిటిషన్‌దారు వాదనను కోర్టు తిరస్కరించింది. కోడలు, ఆమె బంధువులు తనపై బెదిరింపులకు పాల్పడ్డారని రాయబరేలీకి చెందిన సుధా మిశ్రా పోలీసులను ఆశ్రయించారు.

ఐఐటీ-హైదరాబాద్ సహకారంతో, హైదరాబాద్ స్టార్టప్ 'సింప్లిఫోర్జ్ క్రియేషన్స్' లేహ్‌లో భారత సైన్యం కోసం ప్రపంచంలోనే మొట్టమొదటి ఆన్‌సైట్ త్రీడీ ప్రింటెడ్ బంకర్‌ను నిర్మించింది. అత్యంత ఎత్తయిన ప్రదేశంలో కేవలం 30 శాతం ఆక్సిజన్ లభించే చోట మిలిటరీ బంకర్ నిర్మాణం దాదాపు అసాధ్యం. ఇలాంటి కఠినమైన వాతావరణంలో బుల్లెట్ గుండును అడ్డుకోగల, కచ్చితమైన కొలతలతో త్రీడీ ప్రింటెడ్ టెక్నాలజీతో బంకర్ నిర్మాణాన్ని పూర్తిచేసినట్టు ఐఐటీ-హైదరాబాద్ ప్రొఫెసర్ సుబ్రమణియం చెప్పారు.

40 సెకండ్లలో వీసా తిరస్కరణ!

- గర్ల్‌ఫ్రెండ్‌ని కలవడానికి వెళ్తున్నానన్నా
- నిజాయితీగా జవాబిచ్చినా వీసా రిజెక్ట్
- రెడిట్‌లో ఓ భారతీయుడి ఆవేదన

న్యూఢిల్లీ: నిజాయితీగా ఇచ్చిన ఒకే ఒక్క జవాబు.. అమెరికాను సందర్శించాలన్న అతని చిరకాల స్వప్నాన్ని ఛిద్రం చేసింది. అమెరికన్ ఎంబసీలో తనకు ఎదురైన చేదు అనుభవాన్ని ఓ భారతీయ యువకుడు రెడిట్ పోస్టులో పంచుకున్నాడు. ఫ్లోరిడాలో పర్యటించడానికి టూరిస్టు వీసా కోసం దరఖాస్తు చేసుకున్న ఆ యువకుడు న్యూఢిల్లీలోని యూఎస్ ఎంబసీలో ఇటీవల ఇంటర్వ్యూకు వెళ్లాడు. తనను మూడే ప్రశ్నలు అడిగారని, 40 సెకండ్లలో తన దరఖాస్తు తిరస్కరణకు గురైందని చెప్పుకొచ్చాడు. అసలు తప్పు ఎక్కడ జరిగిందో అర్థం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నానని అతను తెలిపాడు. ఇంటర్వ్యూ చేసే అధికారి తనను 'అమెరికాలో నీకు బంధువులు లేక స్నేహితులు ఉన్నారా?' అని అడిగాడని, అందుకు తాను ఎంతో నిజాయితీగా, 'ఫ్లోరిడాలో నా గర్ల్‌ఫ్రెండ్ ఉంటుంది. ఆమెను కలవాలని అనుకుంటున్నాను' అని సమాధానమిచ్చానని ఆ యువకుడు వెల్లడించాడు. ఎంబసీ అధికారి మరో ప్రశ్న అడగకుండా తన చేతిలో 214(బీ) స్లిప్పు(తిరస్కరణ) పెట్టాడని, 40 సెకండ్లలో తన ఆశలు అడియాసలయ్యాయని అతను వాపోయాడు. ఈ పోస్టుకు నెటిజన్ల నుంచి భిన్న స్పందన లభించింది.

మహారాష్ట్రకు పాకిన హిందీ వివాదం

- 1-5 తరగతులకు మూడో భాషగా హిందీ తప్పనిసరి
- ప్రభుత్వం ఉత్తర్వులు.. విపక్షాల తీవ్ర ఆగ్రహం

ముంబై: హిందీ భాషను బలవంతంగా రుద్దుతున్నారనే వివాదం తమిళనాడు, కర్ణాటకల నుంచి మహారాష్ట్రకు వ్యాపించింది. మహారాష్ట్రలో మరాఠీ, ఇంగ్లిష్ మీడియం పాఠశాలల్లో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు మూడో భాషగా హిందీని తప్పనిసరిగా బోధించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీనిపై కాంగ్రెస్, ఎంఎన్ఎస్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఎంఎన్ఎస్ చీఫ్ రాజ్ ఠాక్రే ఎక్స్‌లో స్పందిస్తూ.. రాష్ట్ర ప్రభుత్వంతో పాటు కేంద్ర ప్రభుత్వంపైన కూడా విరుచుకుపడ్డారు. త్రిభాషా సూత్రాన్ని ప్రభుత్వ వ్యవహారాలకే పరిమితం చేసుకోవాలని, విద్య విషయంలో దానిని తీసుకురావద్దని హెచ్చరించారు. మహారాష్ట్రలో ప్రతి దానినీ హిందీయీకరణ చేయడానికి కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలను అనుమతించేది లేదన్నారు. మరాఠీ, మరాఠీయేతరుల మధ్య ఘర్షణను సృష్టించి, రానున్న ఎన్నికల్లో లబ్ధి పొందడానికి ప్రయత్నిస్తున్నారా? అని నిలదీశారు. కాంగ్రెస్ శాసన సభా పక్ష నేత విజయ్ వడెట్టివార్ స్పందిస్తూ, ఈ నోటిఫికేషన్‌ను తక్షణమే ఉపసంహరించాలని డిమాండ్ చేశారు.

అప్పుడు సిమెంట్ డ్రమ్ము.. ఇప్పుడు పాముకాటు

- ప్రియుడితో కలిసి భర్తను దారుణంగా హత్యచేసిన భార్య
- పాముకాటుతో చనిపోయినట్టు నమ్మించేందుకు ప్రయత్నం
- యూపీలోని మీరట్‌లో మరో ఘటన

న్యూఢిల్లీ: భర్తను ప్రియుడితో కలిసి హత్య చేసి, ముక్కలుగా నరికి సిమెంట్ డ్రమ్ములో దాచిన ఘటనను మరువకముందే యూపీలోని మీరట్‌లో మరో ఘటన చోటుచేసుకుంది. ఓ మహిళ ప్రియుడితో కలిసి తన భర్తను గొంతు నులిమి చంపి పాముకాటుతో అతడు చనిపోయాడని నమ్మించేందుకు ప్రయత్నించింది. అయితే శవ పరీక్షలో అసలు విషయం తేలడంతో పోలీసులు భార్యను, ఆమె ప్రియుడిని అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. కూలీగా పనిచేసే అమిత్ గత శనివారం రాత్రి ఇంటికి వచ్చి భోజనం చేశాక నిద్రపోయాడు. అప్పుడు అతడి భార్య రవిత(25), తన ప్రియుడు అమర్‌దీప్ సాయంతో అమిత్ గొంతు నులిమి చంపేసింది. పాము కాటు వల్ల తన భర్త చనిపోయాడని జనాల్ని నమ్మించేందుకు అతడి పడకపై ఒక పామును వదిలి పెట్టింది.అయితే గొంతు నులమడం వల్లే బాధితుడు చనిపోయాడని శవ పరీక్ష ద్వారా తెలుసుకొన్న పోలీసులు రవితను, ఆమె ప్రియుడిని అరెస్ట్ చేశారు. కొన్ని రోజుల కిందట మర్చంట్ నేవీ అధికారి సౌరభ్ రాజ్‌పుత్‌ను అతడి భార్య రస్తోగి ప్రియుడితో కలిసి హత్య చేసి, శవాన్ని ముక్కలు చేసి సిమెంట్ డ్రమ్ములో దాచిన విషయం తెలిసిందే.

భర్తను 36 సార్లు పొడిచి..

- ప్రియుడికి వీడియో కాల్‌లో మృతదేహాన్ని చూపించి..
- ఎంపీలో మైనర్ భార్య ఘాతుకం

ఇండోర్: మధ్యప్రదేశ్‌లోని బుర్హాన్‌పూర్‌లో ఓ మైనర్ భార్య (17) తన భర్తను దారుణంగా హత్య చేసింది. మృతుడు గోల్డెన్ పాండే అలియాస్ రాహుల్ (25)కు నాలుగు నెలల క్రితం వివాహం జరిగింది. పాండే మృతదేహం ఆదివారం కనిపించింది. ఆయన భార్య కనిపించకపోవడంతో పోలీసులు ఆమె ప్రమేయం గురించి అనుమానించారు. మైనర్ భార్యతోపాటు ఆమె ప్రియుడు యువరాజ, అతని ఇద్దరు స్నేహితులను అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. వారు నేరాన్ని అంగీకరించారు. షాపింగ్‌కు వెళ్లిన దంపతులు మార్గమధ్యంలో ఓ రెస్టారెంట్ వద్ద టిఫిన్ చేశారు. అనంతరం ఇరువురు బైక్‌పై ఇంటికి బయల్దేరారు. మార్గమధ్యంలో తన చెప్పు కింద పడిపోయిందని మైనర్ భార్య తన భర్తతో చెప్పింది. దీంతో పాండే బైక్‌ను ఆపాడు. వెంటనే ఆమె స్నేహితులిద్దరితో కలిసి, పాండేను పగిలిన బీరు సీసాతో 36 సార్లు పొడిచారు. పాండే అక్కడికక్కడే మరణించాడు. అనంతరం మృతదేహాన్ని యువరాజుకు వీడియోకాల్‌లో చూపించారు. మృతదేహాన్ని పొలాల్లో విసిరేసి, పారిపోయారు.

రోజూ బాదం తింటే మధుమేహం అదుపులోకి

న్యూఢిల్లీ: రోజూ బాదం తింటే ఆసియా భారతీయుల వంటి నిర్దిష్ట జనాభాల్లో మధుమేహం అదుపులోకి వస్తుందని తాజా పరిశోధన వ్యాసం తెలిపింది. బాదం, గుండె ఆరోగ్యంపై గతంలో ప్రచురితమైన పరిశోధనలను విశ్లేషించిన అంతర్జాతీయ బృందం.. బాదం చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించగలదని, ప్రయోజనకరమైన గట్ బ్యాక్టీరియాను పెంచగలదని పేర్కొంది. షార్ట్-చైన్ ఫ్యాటీ యాసిడ్ల ఉత్పత్తిని బాదం పెంచుతుందని చెప్పింది. ఈ తాజా వ్యాసం కరెంట్ డెవలప్‌మెంట్స్ ఇన్ న్యూట్రిషన్ జర్నల్‌లో ప్రచురితమైంది. రోజూ బాదం తినడం వల్ల చెడు కొలెస్ట్రాల్ 5 యూనిట్లు తగ్గినట్టు పరిశోధకులు గుర్తించారు. అలాగే డయాస్టోలిక్ రక్త పోటు స్వల్ప స్థాయిలోనైనా చెప్పుకోదగ్గ విధంగా 0.17-1.3 ఎంఎంహెచ్‌జీ మధ్య తగ్గినట్టు గుర్తించారు. అదనపు కొవ్వు తగ్గేందుకూ బాదం సాయపడుతుందని తెలిసింది.

టైమ్ జాబితాలో భారతీయులకు దక్కని స్థానం

ట్రంప్, యూనస్‌కు చోటు

న్యూఢిల్లీ: ఈ సంవత్సరం టైమ్ మ్యాగజైన్ ప్రభావవంతమైన వ్యక్తుల జాబితాలో భారతీయులెవరికీ చోటు దక్కలేదు. నిరుటి జాబితాతో పోలిస్తే ఇది ఆశ్చర్యం కలిగించే విషయం. తాజా జాబితాను నాయకులు, ఆదర్శవంతులు, మేధావులు వంటి విభాగాలుగా వర్గీకరించారు. నాయకుల విభాగంలో భారత సంతతికి చెందిన రేష్మా కెవల్‌రమణికి చోటు దక్కింది. ఆమె అమెరికాలో పెద్ద బయో సాంకేతిక సంస్థల్లో ఒకటైన వర్టెక్స్ ఫార్మాసూటికల్స్‌కు మొదటి మహిళా సీఈవోగా సేవలందిస్తున్నారు. నాయకుల కాటగిరీలో స్థానం పొందిన ప్రముఖుల్లో అమెరికా అధ్యక్ష, ఉపాధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్, జేడీ వాన్స్, యూకే ప్రధాని కీర్ స్టార్మర్, బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ సారథి ముహమ్మద్ యూనస్, స్పేస్ ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ ఉన్నారు.

బధిర బాలికపై అఘాయిత్యం

యూపీలో మరో దారుణం

రాంపూర్: బీజేపీ